క్లుప్తంగా

చెట్టుపడి భారీ విషనాగు మృతి



మృతి చెంది ఉన్న విషనాగు

పార్వతీపురం రూరల్: మండలంలోని సంగంవలస శివారులో గల వ్యవసాయ భూములకు వెళ్లే దారిలో ఓ చెట్టు మీదపడి మృతిచెంది ఉన్న 12అడుగుల భారీ కింగ్ కోబ్రాను స్థానికులు గుర్తించారు. అప్పటికే మృతి చెంది ఉన్నట్లు నిర్ధారించారు. గతంలో ఆ ప్రాంతంలో ఎప్పుడూ చూడని భారీ విషసర్పం కనిపించడంతో ప్రజలు, రైతులు భయాందోళన చెందారు. గురువారం నుంచి కురుస్తున్న భారీ వర్షానికి, ఈదురు గాలులకు సమీపంలో ఉన్న బొప్పాయి చెట్టు కూలి మీదపడడంతో మృతి చెంది ఉంటుందని అంతా భావించారు.

104వైద్య సేవలు సద్వినియోగం చేసుకోండి



వాహనంలో పరికరాలను, కిట్లను పరిశీలిస్తున్న జిల్లా మేనేజర్ కృష్ణ

బలిజిపేట: 104వాహనం వైద్యసేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని 104జిల్లా మేనేజర్ కృష్ణ అన్నారు. ఈ మేరకు బలిజిపేట పీహెచ్‌సీ వద్ద ఉన్న 104వాహనాన్ని ఆయన శనివారం ఆకస్మికంగా పర్యవేక్షించారు. సమీపంలో ఉన్న ప్రజలను 104వాహన సేవలపై ప్రశ్నించి సేవలను సక్రమంగా అందిస్తున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. వాహనం కండిషన్‌లో ఉందా లేదా అనేది సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నియామకం

పార్వతీపురం రూరల్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో కురుపాం నియోజక వర్గానికి చెందిన వీటి సూర్యనారాయణ ధాత్రాజ్‌ను పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమిస్తూ శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు పార్టీని మరింత బలోపేతం చేసేవిధంగా పనిచేయాలని సూచనలు జారీ చేశారు.

విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలి



ఎంఈఓ-1సామల సింహాచలంకు ఆర్డర్లు అందిస్తున్న పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు

బలిజిపేట: విద్యార్థులు తెలుగు భాషపై మంచి పట్టు సాధించేవిదంగా వారికి గుణాత్మక విద్యను అందించాలని ఎంఈఓ-1సామల సింహాచలం తెలిపారు. భాషా పండితులుగా పనిచేస్తూ తెలుగు స్కూల్ అసిస్టెంట్స్‌గా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు తెచ్చిన ఆర్డరు కాపీలను ఎంఈఓ-1సామల సింహాచలం తీసుకున్నారు. సూరిరాము(గంగాడ), బి.లలిత(గలావల్లి), శకుంతల(నారన్నాయుడువలస)లు ఎంఈఓ-1ను శనివారం కలిశారు. ఈ సందర్భంగా వారి దగ్గర పత్రాలను తీసుకుని విద్యార్థులకు మంచి భాషా ప్రావీణ్యంతో కూడిన విద్యను అందించి మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి నిమజ్జనం



సాలూరు: పట్టణంలో దేవీ శరన్నవరాత్రులు ముగియడంతో శనివారం సాయంత్రం అమ్మవారి నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని పలువార్డుల్లో ప్రత్యేక మంటపాల్లో కొలువుదీరిన అమ్మవార్లను శాస్త్రోక్తంగా పూజలనంతరం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాల నడుమ సందడిగా అమ్మవారి నిమజ్జన కార్యక్రమాలు చేపట్టారు. పట్టణంలో పంచముఖేశ్వరస్వామి తదితర ఆలయాల్లో పూర్ణాహుతి తదితర ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

సాలూరులో ఆటోడ్రైవర్ల సేవలో కార్యక్రమం

సాలూరు: పట్టణంలో ఆటోడ్రైవర్ల సేవలో పథకం నియోజకవర్గ స్థాయి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ రామచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి సంధ్యారాణి పాల్గొని మాట్లాడుతూ ఆటోడ్రైవర్లకు ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రత్నాకర్, పలువురు అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో సువర్ణముఖి బ్రిడ్జి



కోతకు గురైన సువర్ణముఖి నది బ్రిడ్జిపై ప్రమాదకర ప్రయాణాలు సాగిస్తున్న దృశ్యం

- పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు
- రాకపోకలు సాగించేందుకు వాహనదారుల ఆందోళన

మక్కువ: స్థానిక సువర్ణముఖి నది బ్రిడ్జి మరమ్మతులకు గురైంది. బ్రిడ్జి రక్షణగోడ ఇరువైపులా కూలిపోవడంతో పాటు, బ్రిడ్జిశ్లాబ్‌పై పెద్ద, పెద్ద గోతులు తయారై, ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. అంతేకుండా బ్రిడ్జికి ఇరువైపులా పెద్ద,పెద్ద గోతులయ్యాయి. ఎగువ నుంచి వరదనీరు నిత్యం బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తుంది. దీంతో గోతుల్లో నీరు చేరడంతో, గోతులు కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు బ్రిడ్జి శివారు భాగాన పెద్దగొయ్యి ఏర్పడింది. ఎదురుగా వచ్చిన వాహనాలు తప్పించబోయి, ప్రమాదవశాత్తు జారిపడితే ప్రాణాలు పోయే పరిస్థితి నెలకొన్నప్పటికీ ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ప్రమాదాలు జరగకముందే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



బ్రిడ్జి మరమ్మతులకు గురవడంతో గోతుల్లో చేరిన వరదనీరు



బ్రిడ్జి శ్లాబ్‌పై గోతులు



కూలిన రక్షణ గోడకు చేయని మరమ్మతులు

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే గిరిజన విద్యార్థుల మరణాలు



మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ సంఘనాయుకులు సాయిబాబు, రంజిత్‌కుమార్

పార్వతీపురం: గిరిజన విద్యార్థుల మరణాలన్నీ ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా జరిగినవేనని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర కమిటీ అధ్యక్షుడు తాడంగి సాయిబాబు, ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్‌లు స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం వారు మాట్లాడుతూ కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేకపోవడానికి ప్రభుత్వాలే కారణమన్నారు. గిరిజన గురుకుల పాఠశాలల పర్యవేక్షణకు జిల్లా, ఐటీడీఏ స్థాయిలో ప్రత్యేకంగా అధికారులు లేరని, ఐటీడీఏ పీఓ, డీడీలే పర్యవేక్షణ చేయాలని డిమాండ్ చేశారు. కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను ఎందుకు నియమించలేదని ప్రశ్నించారు. గిరిజన విద్యార్థులు పదుల సంఖ్యలో మరణిస్తుంటే గిరిజన సంక్షేమశాఖమంత్రి, ఎంఎల్ఏలు ఏం చేస్తున్నారని, గిరిజన సంక్షేమ పాఠశాలలో చనిపోయిన కుటుంబాలకు కనీసం రూ.5 లక్షలు పరిహారం ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం వద్ద డబ్బులు కూడా లేవా? అని ఎద్దేవా చేశారు. విద్యార్థి మరణానికి కారణంగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయడం సరికాదని, చర్యలు తీసుకోవాలంటే గిరిజన సంక్షేమ శాఖమంత్రి, ఐటీడీఏ పీఓను, డీడీలను సస్పెండ్ చేయాలని సూచించారు. గిరిజన సంక్షేమశాఖ విద్యాసంస్థలలో మాత్రమే ఎందుకు జరుగుతుందో శాస్త్రీయంగా అధ్యయనంచేసి నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా డైట్ చార్జీలు పెంచకపోతే విద్యార్థులకు పౌష్టికాహారం ఎలా వస్తుందని ప్రశ్నించారు.

సాదాసీదాగా మండల సమావేశం



అధికారులను ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీ రవికుమార్

బలిజిపేట: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నాగమణి అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. వివిధ శాఖలకు చెందిన మండలస్థాయి అధికారులతో రివ్యూ నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఏఓ శివగణేష్ మాట్లాడుతూ ఈ క్రాప్ 20వేల ఎకరాలకు చేయాల్సి ఉండగా ఇప్పటికి 10వేల ఎకరాలకు మాత్రమే పూర్తయిందన్నారు. ఈనెల 25వ తేదీ లోపల పూర్తిచేయించుకోవాలని కోరారు. రైతులు ముందుకు వచ్చి త్వరగా చేయించుకోవాలని చెప్పారు. అన్నదాత సుఖీభవ మండలంలో 8వేల మంది రైతులకు వచ్చిందన్నారు. యూరియాపై జెడ్పీటీసీ రవికుమార్ ప్రశ్నించగా 1450 ఎం.టి అవసరం కాగా మండలానికి 1600ఎం.టి వచ్చిందన్నారు. అజ్జాడలో 800బస్తాలు ఇవ్వాల్సిన అవసరం ఏమిటని, అంతకంటే పెద్దగ్రామాలు ఉన్నప్పటికీ అక్కడి రైతులకు సక్రమంగా అందలేదని ఎందుకలా చేశారని జెడ్పీటీసీ ప్రశ్నించగా అక్కడ అవసరం అయినందున ఇచ్చామని ఏఓ శివగణేష్ తెలిపారు. ఉపాధిహామీ పథకానికి సంబంధించి ఏపీఓ కేశవరావు మాట్లాడుతూ జాబ్‌కార్డులు కలిగిన ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. మండలంలో రూ.4కోట్ల విలువ కలిగిన పనులు చేయగా ఒక రూ.కోటి మాత్రమే వచ్చిందని ఇంకా రూ.3కోట్లు బకాయిలు ఉన్నాయని అవి రావాల్సి ఉందన్నారు. వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల సమాచారాన్ని సమావేశంలో వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీవాణి, జెడ్పీటీసీ రవికుమార్, ఉపాధ్యక్షుడు సాయిరాం, మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

నిలిచిపోయిన 104 వాహనాల సేవలు



పీహెచ్‌సీలో నిలిచి పోయిన 104 సంచార వైద్యసేవల వాహనం

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో ఆధునిక పద్ధతిలో వైద్య సేవలందించే104 సంచార వైద్య కేంద్ర వాహనాలు నిలిచి పోవడంతో వృద్ధులు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో దీర్ఘకాలంగా వివిధ రకాలైన దీర్ఘకలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించకుండా ప్రజలకు నిరంతరం గ్రామాల్లో రోగ నిర్ధారణ పరీక్షలు చేసిన అనంతరం వ్యాధి నిరోధక మందులు డాక్టర్ సిఫారసు మేరకు ఉచితంగా ఇచ్చేవారు. ఈ నేపథ్యంలో తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా పీహెచ్‌సీ డాక్టర్ల అసోసియేషన్ పిలుపు మేరకు మండలంలోని పెదంకలాం, సీతానగరం 104లో సేవలందించడానికి డాక్టర్లు లేని కారణంగా సంచార వైద్య సేవలందించే వాహనాలను నిలిపి వేయాలని ప్రభుత్వం మార్గ దర్శకాలు విడుదల చేయడంతో 104 వాహనాలతో పాటు సిబ్బంది పీహెచ్‌సీలకే పరిమితమయ్యారు. దీంతో గ్రామాల్లో 104 సంచార వైద్యకేంద్రంద్వారా సేవలు పొందుతున్న రోగులు రచ్చబండలు, ఉప ఆరోగ్య కేంద్రాలు, రామమందిరాలవద్ద మందుల కొసం ఎదురు చూస్తున్నారు. మందులు లేక అవస్థలు పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. వాహనాలు నిలిపివేయడంపై సంబంధిత సిబ్బంది వద్ద ప్రస్తావించగా డాక్టర్లు కేందా వాహనాలు తీయవద్దని వైద్యారోగ్య శాఖ మార్గదర్శకాలు విడుదల చేసిందన్నారు.

సమాచార హక్కుచట్టంపై అవగాహన కల్పించుకోవాలి

సీతానగరం: మండలంలోని రైతులు సమాచార హక్కుచట్టంపై అవగాహన కల్పించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల వ్యవసాయ శాఖ ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు స్థానిక రైతు సేవా కేంద్రంలో శనివారం రైతులు, వ్యవసాయ సిబ్బందికి సమాచార హక్కుచట్టం వినియోగం, అమలుపై అవగాహన సదస్సు జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడూ సమాచారహక్కు చట్టం ద్వారా వారికి అందించిన సేవలు నిర్దేశించిన అధికారి నుంచి సకాలంలో పొందవచ్చని అన్నారు. వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించే సమయం, వ్యవసాయ ఉపకరణాలు కొనుగోలు సమయం, వస్తు మార్పిడి సమయంలో సమాచార హక్కు చట్టం ద్వారా హక్కులు వినియోగించుకోవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు జగదీశ్వరరావు, లక్ష్మణ్,వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర తదితరులు

సాలూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు కుమార్తె లేఖ్య వివాహ రిషప్షన్ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పాల్గొన్నారు. శనివారం మండలంలోని మరిపల్లిలో శ్రీనివాసరావు స్వగృహం వద్ద జరిగిన రిసెప్షన్ కార్యక్రమంలో రాజన్నదొర పాల్గొని వధూవరులు లేఖ్య, గణేష్‌లను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, తదితర ప్రముఖులు తరలివచ్చి వధూవరులను ఆశీర్వదించారు.

ఖాళీ జాగా.. కబ్జా చేసేయ్..!



బలిజిపేట మెట్టకాలనీ పక్కనే రాళ్లమెట్ట స్థలాన్ని కబ్జాచేసి కంచెవేసిన ఆక్రమణదారు

బలిజిపేట: ఖాళీ జాగా కనిపిస్తే కబ్జా చేసెయ్..ఎవరు అడుగుతారో చూద్దాం అనుకుంటున్నారో ఏమో తెలియదు కానీ రాతి మెట్టను సైతం కబ్జా చేసేందుకు ముందుకు వచ్చారు. ఇది మా స్థలమే అన్నట్టు రాతిమెట్టను సైతం ఆక్రమించి చుట్టూ దానికి ఫెన్సింగ్ వేసేశారు. ఇది పక్కనే ఉన్న రెవెన్యూశాఖవారికి తెలియదు పాపం. విషయం తెలిసిన తరువాత వారు ఆరాతీసి అది కబ్జానే అని తెలుసుకున్నారు. ప్రస్తుతం మండల కేంద్రమైన బలిజిపేటలో పరిస్థితి ఇది. వివరాల్లోకి వెళ్తే బలిజిపేట మెట్టకాలనీ పక్కనే ఉన్న రాతిమెట్టల స్థలం ఉంది. దీనివద్ద గతంలో ప్రజాప్రయోజనం దృష్ట్యా వాటర్‌ట్యాంక్ నిర్మాణం చేయాలని భావించారు. కానీ అది జరగలేదు. ప్రస్తుతం ఖాళీగా ఉంది. దీనిపై కన్నేసిన ఆక్రమణదారు మరెందుకులే అన్నట్టు రాతిమెట్టను కలిపి కంచెవేశాడు. ఈ విషయమై తహసీల్దార్ బాలమురళిని వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని అది ఆక్రమణ స్థలమేనని దానిని తొలగించనున్నామన్నారు.

బీసీలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలి

- కలెక్టర్‌కు బీసీ సంక్షేమసంఘం వినతిపత్రం అందజేత



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

పార్వతీపురం రూరల్: 2024 ఎన్నికలకు ముందు కూటమి బీసీలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవాల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐదు ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని శనివారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ డా.ఎన్. ప్రభాకరరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాదిన్నర గడుస్తున్నా బీసీలకు ఎస్సీ, ఎస్టీల తరహాలో ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామన్న హామీ ఏమైందంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చట్టసభల్లో 33శాతం, స్థానిక సంస్థల్లో 34శాతం రిజర్వేషన్ల వాగ్దానం ఎప్పుడు అమలు చేస్తారని కూటమి ప్రభుత్వాన్ని పత్రికా ముఖంగా నిలదీశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల లోపు రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర కులగణన పూర్తి చేసి జనాభా దమాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కేవలం మూడు నెలల్లో ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల కమిషన్ భావిస్తున్న తరుణంలో కులగణన లేకుండా బీసీలకు ఏ విధంగా న్యాయం చేస్తారని సందేహం వ్యక్తం చేశారు. అంతే కాకుండా బీసీలకు జనాభా అనుగుణంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించి బీసీ సబ్‌ప్లాన్ అమలు చేయాలని, రాజధాని అమరావతిలో మహాత్మాజ్యోతిరావు బాపూలే-సావిత్రిబాయ్ పూలేల స్మృతి వనాన్ని ప్రపంచ స్థాయిలో నిర్మించాలని కోరారు. ఈ మేరకు పార్టీలకు అతీతంగా బీసీ నేతలంతా తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మహేష్, యువజన అధ్యక్షుడు జగన్‌మోహన్, సరస్వతి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ కష్టాలు తీర్చండి

- రాత్రివేళ అంతరాయంతో అవస్థలు
- పగటిపూట సరఫరా అంతంతమాత్రమే
- తాగునీటికి ఇబ్బందులు



విద్యుత్‌శాఖ సిబ్బందిపై అసహనం వ్యక్తంజేస్తున్న గుంటభద్ర గిరిజనులు

మక్కువ: అయ్యా నెలరోజులుగా కరెంట్‌లేక ఇబ్బందులు పడుతున్నాం. రాత్రివేళ పూర్తిగా సరఫరా ఉండడంలేదు. పగటిపూట ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. కరెంట్ ఉంటే గానీ తాగునీరు దొరకదు. ఇన్ని ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదంటూ విద్యుత్‌శాఖ సిబ్బందిపై గిరిజనులు అసహనం వ్యక్తంచేశారు. మక్కువ మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన గుంటభద్రలో గతంలో ఏర్పాటుచేసిన విద్యుత్ లైన్‌ను నిలుపుదలజేసి, ఆలగరువు, మెండంగి గ్రామాలకు విద్యుత్‌సరఫరా అవుతున్న లైన్‌ను గుంటభద్ర గ్రామానికి ఏర్పాటుచేశారు. దీంతో వర్షం కురిసినా, గాలులు వీచినా చెట్లు ఎక్కువగా ఉన్నందున, కొండలకు సమీపంలో గ్రామం ఉన్నందున విద్యుత్‌సరఫరా నిలిచిపోతుంది. గత నెలరోజుల నుంచి విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో గ్రామానికి చెందిన గిరిజనులంతా శనివారం దుగ్గేరు గ్రామం మార్కెట్ యార్డుకు చేరుకున్నారు. విద్యుత్‌సిబ్బంది తక్షణమే దుగ్గేరు చేరుకోవాలని సమాచారం అందించారు. కొంత సమయం తరువాత విద్యుత్‌సిబ్బంది దుగ్గేరు చేరుకోవడంతో, సిబ్బందిపై గిరిజనులు ఫైర్ అయ్యారు. సోమవారం వరకు సమయం ఇస్తే, పాత విద్యుత్ లైన్‌ను పునరిద్ధరిస్తామని విద్యుత్‌శాఖ సిబ్బంది హామీ ఇవ్వడంతో గిరిజనులు వెనుదిరిగారు.

కడచూపు చూసేందుకు వెళ్లి వస్తూ..

- అడారుగెడ్డను తాడుసహాయంతో దాటుతున్న గిరిజనులు



అడారుగెడ్డను తాడుసహాయంతో దాటుతున్న గిరిజనులు

మక్కువ: ఓ వ్యక్తిని కడచూపు చూసేందుకు అతని బంధువులు ప్రమాదకర ప్రయాణాలు సాగించారు. అడారుగెడ్డ ఉధృతంగా ప్రవహించినప్పటికీ, తప్పనిసరి పరిస్థితిలో తాడు సహాయంతో గెడ్డను దాటి, తమ బంధువు మృతదేహాన్ని చూసేందుకు సాహసం చేయాల్సి వచ్చింది. మండలంలోని గుంటభద్ర గ్రామానికి చెందిన సీదరపు సూరయ్య(55) అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. ఈ వార్త తెలుసుకున్న చుట్టుపక్కల గిరిజన గ్రామాలనుంచి, బంధువులు గ్రామానికి చేరుకుంటుండగా, అడారుగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. గెడ్డమధ్యలో ఏర్పాటు చేసుకున్న తాడు సహాయంతో, గిరిజనులు ప్రమాదకర ప్రయాణాలు సాగించి, గ్రామంలోకి చేరుకుని సూరయ్య మృతదేహానికి నివాళులు అర్పించి గిరిజనులు మళ్లీ తాడు సహాయంతోనే గెడ్డ ఒడ్డుకు చేరుకున్నారు.

పీపీపీ లీజు నిర్ణయాన్ని తక్షణమే రద్దుచేయాలి

- రైతుకూలీసంఘం డిమాండ్



నిరసన ర్యాలీ చేస్తున్న రైతుకూలీసంఘం నాయకులు

మక్కువ: ప్రభుత్వ వైద్యకళాశాలల పీపీపీ లీజు నిర్ణయాన్ని రాష్ట్రప్రభుత్వం తక్షణమే రద్దుచేసి, ప్రభుత్వ ఆధ్వర్యంలో వైద్యకళాశాలలు నడపాలని రైతుకూలీసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పీడిక అసిరి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని నంద గ్రామంలో శనివారం ఆర్‌సీఎస్ నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌సీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అసిరి మాట్లాడుతూ 10ప్రభుత్వ వైద్యకళాశాలల పీపీపీ లీజు నిర్ణయం రద్దుచేసి, ప్రతిపాదనలో ఉన్న పార్వతీపురం మెడికల్ కళాశాలను తక్షణమే పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. శతశాతం ఎంబీబీఎస్ సీట్లను ప్రభుత్వ కోటాలోనే భర్తీచేయాలన్నారు. అలాగే షెడ్యూల్డ్ గ్రామమైన బీరమాసి గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో, గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వైద్యం, విద్య, ఇతరత్రా ఏ అవసరమొచ్చినా గిరిశిఖర గ్రామం బీరమాసి నుంచి, దిగువనున్న గ్రామాలకు చేరుకోవాల్సి ఉందన్నారు. అధికారులు స్పందించి తక్షణమే బీరమాసి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌సీఎస్ నాయకులు ప్రసాద్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల మరణాలకు కారణం ప్రభుత్వ నిర్లక్ష్యమే

పార్వతీపురం:

కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల బాలిక పాఠశాలలో విద్యార్థులు అధిక సంఖ్యలో అనారోగ్యానికి గురవడం, అలాగే ఇద్దరు విద్యార్థులు మృతిచెందడానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని సీపీఐ నాయకుడు, ఏఐఎస్ఎఫ్ నాయకుడు ఆర్‌వీఎస్ కుమార్, బి. రవికుమార్‌లు అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను వారు పరామర్శించి పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థుల ప్రాణాలు బలికావాల్సి వస్తోందని విమర్శించారు. మౌలిక వసతుల లేమి, పౌష్టికాహార లోపం, పర్యవేక్షణ లోపం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. మృతిచెందిన విద్యార్థుల కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ పీఓ, డీడీలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్రస్థాయి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. లేకుంటే జిల్లా వ్యాప్తంగా నిరసనలు తెలియజేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు హరి, వికాస్, చరణ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడు లేక వెలవెలబోతున్న వైద్యశిబిరాలు

- పీహెచ్‌సీలకే పరిమితమైన 104 వాహనాలు
- ఇబ్బందులు పడుతున్న గిరిజనులు



వైద్యుడు లేకపోవడంతో వెలవెలబోతున్న తోణాం వారపు సంత వద్ద నిర్వహిస్తున్న వైద్యశిబిరం

సాలూరు: కనిపించే దేవుడిగా వైద్యుడిని ప్రజలు భావిస్తారు.కూటమి ప్రభుత్వంలో వైద్యులు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె బాట పట్టారు. ఈ నేపథ్యంలో ప్రజలు వైద్యసేవల కోసం తల్లడిల్లిపోతున్నారు. ముఖ్యంగా ఏజెన్సీ గ్రామాల్లో గిరిజనుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. ఎంత పెద్ద రోగమొచ్చినా బిడియంతో బయటకు చెప్పుకోలేని అమాయక గిరిజనులు, ప్రస్తుతం వైద్యుల సమ్మెతో మరింత అధికంగా ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు వైద్యసేవలను నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చేరువచేశారు. జగనన్న ఆరోగ్యసురక్షతో గ్రామాల్లో ప్రజల ఇంటికే వైద్యసేవలను చేరువయ్యాయి. పీహెచ్‌సీల్లో ఇద్దరు వైద్యులను నియమించి ప్రజలకు 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండేలా చేశారని ప్రజలు చర్చించుకుంటున్నారు. నేటి ప్రభుత్వంలో వైద్యులు సమ్మె బాట పట్టారు. దీంతో ప్రభుత్వం ఏరియా ఆస్పత్రుల నుంచి లేదా వేరే ప్రాంతాల్లో ఉన్న రెగ్యులర్ డాక్టర్లను పీహెచ్‌సీలకు ఒక్కొక్కరిని నియమించి తాత్కాలిక వైద్యసేవలు అందించే ప్రయత్నం చేస్తోంది. అయితే వారు పీహెచ్‌సీలో తప్ప గ్రామాల్లో వైద్య శిబిరాలకు హాజరయ్యే అవకాశం లేదు. కాగా శనివారం మండలంలోని తోణాం వారపు సంతలో వైద్యుడు లేకుండా వైద్యసిబ్బందే వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు లేకపోవడంతో స్థానిక గిరిజనులు కూడా ఈ శిబిరం వైపు ఆసక్తి చూపలేదు. గతంలో ఇక్కడ వందల్లో ఓపీ వచ్చేది. వైద్యులు లేకపోవడంతో నియోజకవర్గంలో 104 చంద్రన్న సంచార వాహనాలు స్థానిక పీహెచ్‌సీలకే పరిమితమవుతున్నాయి. వైద్యులు సమ్మెను విరమించనట్లయితే, ప్రస్తుతం వర్షాలు పడిన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు క్రమేణా ప్రబలి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది.